స్పోకెన్ ఇంగ్లీష్‌లో శిక్షణ

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణా శిబిరంలో భాగంగా ఆదివారం విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లీష్‌లో శిక్షణ ఇచ్చారు. విద్యార్థులకు ఉపాధ్యాయులు జి.లక్ష్మీనారాయణ విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లీష్‌లో శిక్షణ ఇచ్చారు. అలాగే హెచ్‌ఎం ఆర్.వెంకటేశ్వరరావు విద్యార్థులకు కథలు చదవడం, కథలు చెప్పడంలో శిక్షణ ఇచ్చారు. గ్రంథాలయాధికారి పాలంకి నాగరాజు అధ్యక్షతన జరిగిన ఈ శిబిరంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

శిక్షణా శిబిరంలో ఉపాధ్యాయులు

జియో ట్యూబ్ ధ్వంసం

- రూ.14 కోట్లు సముద్రం పాలు
- కోతకు గురవుతున్న తీర ప్రాంతం
- కడలిలో కలిసిపోతున్న మత్స్యకార గృహాలు

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

అలల తాకిడికి ఉప్పాడలో నిర్మించిన జియో ట్యూబ్ సముద్ర గర్భంలో కలిసిపోవడంతో మత్స్యకార గృహాలు కోతకు గురవుతున్నాయి. రూ.14 కోట్లతో నిర్మించిన జియో ట్యూబ్ నిర్వహణ లేకపోవడంతో సముద్రపు అలల తాకిడికి ధ్వంసం అయిందని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

2004లో కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టిన తర్వాత కోతకు గురవుతున్న ఉప్పాడ గ్రామాన్ని రక్షించాలనే లక్ష్యంతో 2008లో రాష్ట్రంలోనే మొట్టమొదటిగా జియో ట్యూబ్ నిర్మాణానికి అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం పనులకు శ్రీకారం చుట్టింది. అమీనాబాద్ సమీపం నుంచి ఉప్పాడ శివారు వరకు సుమారు రెండు కిలోమీటర్ల మేర జియో ట్యూబ్‌ను నిర్మాణం చేపట్టింది. దీంతో అలల తాకిడికి ఉప్పాడ గ్రామం కోతకు గురికాకుండా నిలిచింది. అయితే కొన్ని సంవత్సరాలుగా జియో ట్యూబ్ నిర్వహణను అధికార యంత్రాంగం గాలికి వదిలేయడంతో కాలక్రమీనా జియో ట్యూబ్ ధ్వంసం అయ్యింది. దీంతో అలల తాకిడికి మత్స్యకార గృహాలు సముద్ర గర్భంలో కలిసిపోతున్నాయి. విపత్తులు సంభవించినప్పుడు సముద్రం ఉగ్రరూపం దాల్చడంతో కొనపాపేట, ఉప్పాడలో వందలాది గృహాలు సముద్రంలో కలిసిపోవడం పరిపాటిగా మారింది. గృహాలే కాకుండా ఆలయాలు, ఆర్ అండ్ బి అతిథి గృహం సముద్రంలో ఇప్పటికే కలిసిపోయాయి. తుపాన్లు సంభవించినప్పుడు తీర ప్రాంతంలో ఉన్న మత్స్యకారులు ఏ సమయాన్ని ఏం జరుగుతుందో అని బిక్కుబిక్కుమంటూ జీవిస్తున్నారు. తుపాను సమయంలో అధికారులు, రాజకీయ నాయకులు హడావిడి చేస్తూ తీర ప్రాంతాలను పర్యటిస్తూ త్వరలోనే శాశ్వత పరిష్కారం చూపుతామని హామీలను గుప్పించడం అనేది కొనసాగుతూనే ఉంది. అయితే కోత నివారణకు చర్యలు చేపట్టడం శూన్యమని పలువురు వాపోతున్నారు.

అలల తాకిడి కి ధ్వంసమైన జియో ట్యూబ్

ధ్వంసం అవుతున్న బీచ్ రోడ్డు

ఉప్పాడ కాకినాడ బీచ్ రోడ్డు అలల తాకిడికి ధ్వంసం అవుతున్న అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. బీచ్ రోడ్డు నిర్మాణానికి నిధులు కేటాయించడం జరిగిందని ప్రజాప్రతినిధులు చెప్పడం తప్ప ఆచరణలో నిధుల సంగతి తేల్చడం లేదు. జిల్లా కేంద్రమైన కాకినాడకు చేరుకోవడానికి ఉప్పాడ కాకినాడ బీచ్ రోడ్డు ఎంతో అనువుగా ఉంటుంది. విద్యార్థులు, వ్యాపారస్తులు, ఉద్యోగస్తులు బీచ్ రోడ్డులోనే ప్రయాణం సాగిస్తూ ఉంటారు. ఉప్పాడ నుంచి నేమం సమీపం వరకు బీచ్ రోడ్డు ధ్వంసం కావడంతో వాహనదారులు అనేక ఇబ్బందులకు గురవుతూ ప్రయాణం సాగిస్తున్నారు. ఏ మాత్రం ఆదమరచి ప్రయాణం చేసినా ప్రాణాలు కోల్పోవాల్సిందే. అలల తాకిడిని నివారించేందుకు రక్షణగా రాళ్ళు వేయడంతో సముద్రం ఉగ్రరూపం దాల్చినప్పుడు బీచ్ రోడ్డుపైకి రాళ్ళ చేరుతున్నాయి. మరోపక్క భారీ గుంతలు ఏర్పడడంతో ప్రయాణం ప్రమాదకరంగా మారింది. సాగరమాల పేరుతో ప్రస్తుతం ఉన్న బీచ్ రోడ్డును గాలికి వదిలేశారని స్థానికులు ఆరోపిస్తున్నారు. గతంలో మాదిరిగానే కొనపాపేట నుంచి నేమం సమీపం వరకు జియో ట్యూబ్ నిర్మాణం చేపట్టాలని తీర ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

సముద్ర గర్భంలో కలిసిపోతున్న మత్స్యకారుల గృహాలు (ఫైల్ ఫోటో)

తుఫాను సమయాల్లో రోడ్డు పైకి చేరుతున్న రక్షణ రాళ్ళు

3 కోతకు గురవుతున్న ఉప్పాడ గ్రామం (ఫైల్ ఫోటో)

చేదువాడలో ధాన్యం బట్వాడాను పరిశీలిస్తున్న రాజబాబు

ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించాలి

ప్రజాశక్తి - కాజులూరు

ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించాలనీ జిల్లా కౌలు రైతుల సంఘం కార్యదర్శి వల్లు రాజబాబు డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని చేదువాడ, కాజులూరు, శీలలంక గ్రామాల్లో ధాన్యం అమ్మకాల్లో తలెత్తుతున్న ఇబ్బందులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు కల్గుతున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతులు పిల్లి శ్రీనివాసు, వాసంశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ క్వింటాకు మద్దతు ధర రూ.2,200 అని ప్రకటించినా ఆచరణలో రూ.2 వేలు ఇస్తున్నారని, 75 కేజీలకు రూ.1500 మాత్రమే ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్వింటాకు కనీస ధర రూ.4 వేలు ఇవ్వాలని ఢిల్లీ కేంద్రంగా రైతుల పెద్దఎత్తున పోరాటం చేశారని గుర్తు చేశారు. అయినా కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తుందన్నారు. రైతు ఉద్యమం ఫలితంగా ఇచ్చిన హామీలను సైతం అమలు చేయడం లేదని అన్నారు. 2014లో ప్రభుత్వం వేసిన మూడు కమిషన్లు ధాన్యానికి గిట్టుబాటు ధర రూ.3300 ఇవ్వాలని నివేదిక ఇచ్చిందని, అయినా బిజెపి ప్రభుత్వం పట్టించు కోలేదని అన్నారు. ప్రస్తుతం ఎరువులు, పురుగు మందులు, వ్యవసాయ కూలీల ఖర్చులు, యంత్రాల ఖర్చులు భూ యజమానికి ఇవ్వాల్సిన కౌలుతో కనీసం క్వింటాకు రూ.4 వేలు ఇస్తేనే రైతుకు గిట్టుబాటు అవుతుందన్నారు. మద్దతు ధరకు సిఎంఆర్ ద్వారా ప్రభుత్వం కొనుగోలు చేయలేని కారణంగా మిల్లర్లు రైతుల వద్ద క్వింటాకు రూ.200 తగ్గించి కొనుగోలు చేస్తున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అయినా కేరళ తరహాలో ప్రత్యేక నిధి ద్వారా రైతుకు రూ.900 క్వింటాకు ఇవ్వాలని రైతు సంఘాలు కోరుతున్నా వైసిపి ప్రభుత్వం పట్టించు కోవడం లేదని అన్నారు. ప్రభుత్వమే ధాన్యం కొను గోలు చేయాలని, ధాన్యంను మిల్లులకు చేర్చడానికి అయ్యే ఖర్చులన్నీ ప్రభుత్వమే భరించాలని ఆయన డిమాండ్ చేశారు.

వైజాగ్ వారియర్స్ టీమ్‌లో సామర్లకోట యువకుడు

ప్రజాశక్తి - సామర్లకోట

ఆంధ్ర ప్రీమియర్ లీగ్ వైజాగ్ వారియర్స్ టీమ్‌కు సామర్లకోట వీర రాఘవపురంకి చెందిన క్రీడా కారుడు పెంకె మణికంఠ గంగాధర్ ఎంపికయ్యాడు. మణికంఠ గంగాధర్ క్రికెట్‌లో మంచి ఆటతీరు కనబర్చ డంతో ప్రీమియర్ వైజాగ్ వారియర్స్ టీమ్‌కు ఎంపిక చేసినట్లు క్రికెట్ సంఘం ప్రతినిధులు ఆదివారం వెల్లడించారు. మణికంఠ ఎంపిక పట్ల జిల్లా క్రీడా సంఘం అధ్యక్షులు శివకుమార్, కార్యదర్శి సత్యనారాయణ, వ్యవస్థాపకులు ఆవాల లక్ష్మీనారాయణ తదితరులు హర్షం వ్యక్తం చేసి మణికంఠకు అభినందనలు తెలిపారు.

కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత 'సుందరయ్య'

-జిల్లాలో పలు ప్రాంతాల్లో పుచ్చలపల్లికి ఘన నివాళి

దక్షిణ భారత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతి జిల్లాలోని పలు ప్రాంతాల్లో జరిగింది. సిపిఎం, ఇతర ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం ఆయన చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సుందరయ్య ఇచ్చిన స్ఫూర్తితో 'ఉన్నంతలో సాయం.. ఉన్నంత వరకు చేద్దాం' అనే పిలుపులో భాగంగా సేకరించిన పుస్తకాలు, దస్తులు, గిన్నెలు వంటివి సేకరించి పేదలకు అందచేశారు.

ప్రజాశక్తి - యంత్రాంగం

కాకినాడ: దక్షిణ భారత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని నగరంలోని కచేరిపేట సుందరయ్య భవన్‌లో ఘనంగా నిర్వహించారు. సిపిఎం నగర కమిటీ సభ్యులు కె.సత్తిరాజు అధ్యక్షతన జరిగిన వర్ధంతి కార్యక్రమంలో తొలుతగా సుందరయ్య చిత్రపటానికి సిపిఎం జిల్లా కన్వీనర్ ఎం.రాజశేఖర్, సీనియర్ నేత దువ్వా శేషబాబ్జి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుందరయ్య జీవితం ఆద్యంతం సేవ, ఉద్యమాలు, పోరాటాలతో, నిరాడంబరతతో ముడిపడి ఉందన్నారు. దక్షిణ భారత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాణంలో కీలకపాత్ర పోషించారని గుర్తు చేశారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట సారథిగా నిలిచారన్నారు. పార్లమెంటులో, శాసనసభ్యునిగా ప్రజావాణిని వినిపించారన్నారు. ప్రస్తుత రాజకీయాలు ప్రయివేటు, కార్పొరేట్‌ల జోక్యంతో కలుషితమయ్యాయన్నారు. బిజెపి అధికారంలోకి వచ్చాక రాజ్యాంగానికే ప్రమాదం ఏర్పడిందన్నారు. నేటి తరం సుందరయ్య స్ఫూర్తితో విలువల కోసం నిలబడాలన్నారు. అనంతరం 'ఉన్నంతలో సాయం ఉన్నంత వరకు చేద్దాం' అనే పిలుపులో భాగంగా దుస్తులు, గిన్నెలు, పుస్తకాలు ఇతర వస్తువులు సుందరయ్య భవన్‌కు అందించారు. అనంతరం అవసరార్థులకు వాటిని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర కన్వీనర్ పలివెల వీరబాబు, నాయకులు మలక వెంకటరమణ, కె.నాగజ్యోతి, సూర్యనారాయణ, వర్మ, సుబ్బారావు, వెంకట్రావు, శ్రీనివాస్, ఏడుకొండలు, సత్యనారాయణ, ప్రసాదరావు, జగదీష్, సంజయ్, నాగలక్ష్మి, అమత, విద్య, తదితరులు పాల్గొన్నారు. **కాకినాడ రూరల్:** మండలంలోని వలసపాకల సుందరయ్య కాలనీలోని సిఐటియు కార్యాలయంలో సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కాకినాడ రూరల్ సిఐటియు మండల కన్వీనర్ టి.రాజా, పెద్దింశెట్టి రామకృష్ణ, మేడిశెట్టి వెంకటరమణ మాట్లాడుతూ ఉద్యమమే ఊపిరిగా, ప్రజా సేవకు అంకితమై ఆడంబరాలకు, ఆర్భాటాలకు దూరంగా ఉంటూ ఆరు దశాబ్దాలకుపైగా రాజకీయ జీవితాన్ని గడిపిన మహోన్నత వ్యక్తి సుందరయ్య అని అన్నారు. ఈ కార్యక్రమంలో సుందరయ్య కాలనీ ప్రజలు ఎ.నీలయ్య, జి.అప్పలనాయుడు, ఎం.సత్యనారాయణ, మీరా సాహెబ్, పద్మ, లక్ష్మి, సిఐటియు నాయకులు డి.సత్యనారాయణ, నూకరాజు, సంగీతరావు, వాసన్ శెట్టి సత్తిబాబు, శ్రీను, సురేష్, రాంబాబు పాల్గొన్నారు. **పెద్దాపురం:** .సిపిఎం పెద్దాపురం నియోజకవర్గ కమిటీ ఆధ్వ ర్యంలో స్థానిక యాసలపు సూర్యారావు భవనంలో సిపిఎం కార్యదర్శి నీలపాల సూరిబాబు అధ్యక్షతన సుందరయ్య వర్ధంతి సభ జరిగింది. ఈ సందర్భంగా సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సిపిఎం రాష్ట్ర నాయకులు మిరియం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ భూస్వామ్య కుటుంబంలో పుట్టిన సుందరయ్య చిన్ననాటి నుంచి స్వాతంత్ర పోరాటాలలో పాల్గొనడమే కాకుండా కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాతగా అనేక ప్రజా పోరాటాలు నిర్మించారన్నారు. ఈ సభలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కరణం ప్రసాదరావు, బాలం శ్రీనివాస్, జి. సత్తిబాబు, సిహెచ్.సత్యనారాయణ, డి.సత్య నారాయణ, ఎస్.మరిడియ్య, సిరపరపు శ్రీనివాస్, జి పెంటయ్య, సుబ్బలక్ష్మి, వీర్రాజు, రాంబాబు, హనుమంతు, యువరాజు, మహేష్, సురేష్ పాల్గొన్నారు. **యు.కొత్తపల్లి:** మండలంలోని ఎండపల్లి జంక్షన్ వద్ద సిపిఎం ఆధ్వర్యంలో సుందరయ్య వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జాతీయ ఉపాధ్యక్షురాలు బేబీరాణి పాల్గొని సుందరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భం గా ఆమె మాట్లాడుతూ మండు ఎండల్లో పనులు చేసుకుంటున్న కూలీలకు చలివేంద్రం ఉపయోగకరంగా ఉంటుందని, సామాన్యులు చలివేంద్రంలో పంపిణీ చేస్తున్న మజ్జిగని వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి జి.అప్పా రెడ్డి, సిఐటియు మండల అధ్యక్షులు కె.నాగేశ్వర రావు, కార్యదర్శి కెవివి.సత్యనారాయణ, బిల్డింగ్ వర్కర్స్ మండల కార్యదర్శి సిహెచ్.సాంబ శివకుమార్, వైసిపి నాయకులు డి.రాజ్‌కుమార్ పాల్గొన్నారు. **ఏలేశ్వ రం:** ప్రత్తిపాడులో సుందరయ్య వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. అనంతరం మజ్జిగ పంపిణీ చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం కార్యదర్శి రోంగల ఈశ్వరరావు మాట్లాడుతూ సుందరయ్య త్యాగాలు మరువలేనివి అన్నారు. ఈ కార్యక్రమంలో మెట్ల శ్రీను, పోనపల్లి రమణ, కొల్లి సతీష్ కుమార్, అల్లాడి లక్ష్మి, నాని, వై రవి, లక్ష్మణ్, తాతారావు పాల్గొన్నారు. **పిఠాపురం:** మండలంలోని విరవాడ పిహెచ్‌సి కాలనీలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్ళు అర్పించారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి కె.సింహాచలం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు రుద్రవరపు భూలోకం మాట్లాడుతూ పుచ్చలపల్లి సుందరయ్య కుల వివక్షను రూపుమాపడానికి తన గ్రామం నుంచే కృషి చేశారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో నాగేశ్వరరావు, లోవరాజు, అప్పారావు అప్పారావు, కె.నాగేశ్వరరావు పాల్గొన్నారు. **తాళ్లరేవు:** స్థానిక ప్రజా సంఘాల భవనంలో టేకుమూడి ఈశ్వరరావు అధ్యక్షతన సుందరయ్య వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు కెఎస్.శ్రీనివాస్, వల్లు రాజబాబు, వడ్డి ఏడుకొండలు, అత్తిలి బాబురావు, ఉంగరాల వెంకటేశ్వరరావు తదితరులు మాట్లాడారు. ముందుగా సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

సుందరయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు రాజశేఖర్, శేషబాబ్జి, సత్తిరాజు, వీరబాబు తదితరులు

యు.కొత్తపల్లిలో నివాళులర్పిస్తున్న బేబిరాణి

తాళ్లరేవులో నివాళులర్పిస్తున్న కెఎస్.శ్రీనివాస్, ఈశ్వరరావు తదితరులు

పెద్దాపురంలో...

కాకినాడ రూరల్‌లో...

పిఠాపురంలో...

కార్టూ'నిజం'



బస్‌కాంప్లెక్స్ బురదమయం

ప్రజాశక్తి - జగ్గంపేట

జగ్గంపేటలో ఉన్న ఆర్‌టిసి కాంప్లెక్స్ బురదమయంలో దర్శనమిస్తుంది. ఈ బస్‌స్టేషన్ నుంచి నిత్యం వేలాది మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. అయితే బస్‌స్టేషన్ ఇన్, అవుట్ గేట్‌ల వద్ద గుంతలు ఏర్పడటంతో వర్షపునీటితోపాటు, మురుగు నీరు నిలిచిపోతుంది. దీంతో ఆ గుంతలను దాటుకుని లోపలకు, బయటకు వెళ్లేందుకు ప్రయాణికులు నానా ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. అదేవిధంగా సమాచార కేంద్రం వెనుక ప్రయాణీకులు కాంప్లెక్స్ లోపలకి వెళ్లే మార్గం సైతం బురదతో స్వాగతం పలికుతోంది. దీంతో ప్రయాణికులు ఆ మార్గంలో వెళ్లలేక చుట్టు తిరిగి లోపలకు వెళ్లాల్సిన దుస్థితి నెలకుంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తక్షణమే గుంతలను పూడ్చడంతోపాటు, నీటి మురుగునీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

బస్‌కాంప్లెక్స్ ఆవరణలో బురదతో రహదారి

బస్సులు బయటకు వచ్చే మార్గంలో ఏర్పడిన గుంత

చిన్నారులకు శిక్షణ ఇస్తున్న కోచ్

బాక్సింగ్ కోచింగ్ ప్రారంభం

ప్రజాశక్తి - పిఠాపురం

పట్టంలోని స్థానిక ఆర్‌ఆర్‌బిహెచ్‌ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఉచిత సమ్మర్ బాక్సింగ్ కోచింగ్ ప్రారభించినట్లు కోచ్ పి.లక్ష్మణరావు ఒక ప్రకటనలో తెలిపారు. కాకినాడ జిల్లా బాక్సింగ్ అసోసియేషన్, జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో ఈ నెల 31 తేదీ వరకు ఉదయం 6 గంటల నుంచి 7:30 వరకు కోచింగ్ ఇస్తామన్నారు. రాబోయే రోజుల్లో శిక్షణ తీసుకున్న వారు వివిధ పోటీల్లో పాల్గొనేలా బాక్సింగ్‌లో అన్ని మెలకువలతో శిక్షణ ఇస్తామని తెలిపారు.

రోగులకు భరోసాగా 'ఫ్యామిలీ డాక్టర్'

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

కుటుంబ వ్యవస్థలో ఫ్యామిలీ డాక్టర్ సేవలు ఉంటే 80 రోగాలను ప్రాథమిక స్థాయిలోనే గుర్తించి సకాలంలో చికిత్స చేసి నయం చేసే అవకాశం ఉంటుందని డాక్టర్ అడ్డాల సత్యనారాయణ అన్నారు. ఆదివారం స్థానిక ఎపిఐఐసి కాలనీలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రపంచ ఫ్యామిలీ డాక్టర్ దినోత్సవం పురస్కరించుకుని అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూర్వకాలంలో ఫ్యామిలీ డాక్టర్, రోగుల కుటుంబాల మధ్య బంధం ఉండేదని ఏ జబ్బు వచ్చినా సరైన సమయంలో, నాణ్యమైన వైద్యం అందించే వారని అన్నారు. వారికి కుటుంబ సభ్యుల ఆరోగ్య చరిత్రపై పూర్తి అవగాహన ఉండేదన్నారు. దీంతో ప్రాథమిక స్థాయిలోనే నవజాత శిశువు నుంచి వృద్ధుల వరకూ వచ్చే సాధారణ వ్యాధులను నయం చేసే వారని అన్నారు. కానీ నేడు ఫ్యామిలీ డాక్టర్ వ్యవస్థ కనుమరుగవడంతో ఏ చిన్న అనారోగ్య సమస్య వచ్చినా సూపర్ స్పెషలిస్టుల దగ్గరకు పరిగెత్తాల్సిన పరిస్థితి వచ్చిందని తెలిపారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ప్రారంభించిందని, ప్రజల ఆరోగ్యానికి బాధ్యత వహించే విధంగా ఫ్యామిలీ డాక్టర్ ను ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. ఈ వ్యవస్థను మరింత పటిష్టంగా నిర్వహించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో అడబాల రత్నప్రసాద్, ఎస్.శ్రీనగేష్, నిమ్మకాయల వెంకటేశ్వరరావు, రేలంగి బాపిరాజు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ అడ్డాల

నేరాలు ఘోరాలు

మహిళ దారుణ హత్య

ప్రజాశక్తి - కోటనందూరు

తుని 16వ జాతీయ రహదారి రాజులు కొత్తూరు సమీపంలో టి.వెంకటాపురం గ్రామానికి వెళ్లే మట్టి రోడ్లో గుర్తుతెలియని మహిళ దారుణ హత్యకు గురైయింది. ఈ విషయం ఆదివారం ఉదయం వెలుగులోకి వచ్చింది. స్థానికులు ఇచ్చిన సమాచారంతో తుని రూరల్ ఎస్ఐ డి.రమేష్‌బాబు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఆయన స్థానికులతో మాట్లాడి ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. హత్య కేసుగా భావించి ఈ ఘటనపై కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం హత్యకు గురైన మహిళ తుని పట్టణం దిబ్బలపాలెంలో రాపర్తి చిన్ని అమ్ములతో పాటు నివాసం ఉంటూ తుని ఆర్‌టిసి కాంప్లెక్స్ సమీపంలోనూ, రైల్వే స్టేషన్లో సమీపంలోనూ తిరుగుతూ ఉండేదని విచారణలో తేలిందని అన్నారు. మృతదేహాన్ని తుని ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలియజేశారు.

మద్యం కేసులో వ్యక్తి అరెస్ట్

ప్రజాశక్తి -దేవరపల్లి

దేవరపల్లిలో మద్యం సీసాలు కలిగి ఉన్న వ్యక్తిని సెబ్ పోలీసులు అరెస్టు చేశారు. ఆదివారం దేవరపల్లి ఎస్ఇబి స్టేషన్ పరిధిలో డిస్ట్రిక్ట్ స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి ఆదేశాల మేరకు కృష్ణంపాలెంలో దాడులు చేశారు. 8 మద్యం సీసాలతో ఒక వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు సిఐ కె.స్వామి తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేశామన్నారు. ఈ దాడుల్లో ఎస్ఐ పి.సుధీర్, సిబ్బంది పాల్గొన్నారు.

గోదావరిలో స్నానం చేస్తూ బాలుడు మృతి

ప్రజాశక్తి -ఆత్రేయపురం

తన స్నేహితులతో కలిసి వచ్చిన బాలుడు గోదావరిలో స్నానం చేస్తూ మృతి చెందాడు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు వారి వివరాలు ప్రకారం రాజమహేంద్రవరం శాంతినగర్ కు చెందిన దాడాల దినేష్(16) తన స్నేహితులతో కలిసి కాటన్ బ్యారేజీ వద్ద ఇసుక తిన్నెలలో ఆహ్లాదకంగా గడిపేందుకు వచ్చారు. పిచ్చుక లంక అన్నపూర్ణ గుడి వద్ద పోలీసులు ఉండడంతో బొబ్బర్లంక చెంతనే బ్యారేజీ దిగులో తన స్నేహితు కలిసి స్నానానికి దిగారు దీంతో నీటి ఒరవడి ఎక్కువగా ఉండటంతో ఊబిలో చిక్కుపోయిన దినేష్ గౌతమి గోదావరి నదిలో ఒక్కసారిగా మునిగిపోయి గల్లంతయ్యాడు. దీంతో తోటి స్నేహితులు కేకలు వేయగా స్థానికులు వచ్చి గాలింపు చర్యలు చేపట్టారు గల్లంతైన పరిసర ప్రాంతాల్లోనే దినేష్ శవమై తేలాడు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎస్.శ్రీనివాస్ తెలిపారు.

టెన్త్‌లో ప్రతిభ చూపిన విద్యార్థినికి సత్కారం

ప్రజాశక్తి -మామిడికుదురు

టెన్త్ ఫలితాల్లో పెదపట్నం లంక హైస్కూల్ విద్యార్థిని గిడుగు రమ్య దుర్గ మండల ఫస్ట్ ర్యాంక్ సాధించింది. ఈ సందర్భంగా ఆదివారం సర్పంచ్ సుందర నీడి రాజేష్‌కుమార్, ఎంపిటిసి సభ్యుడు కొమ్ముల జంగమయ్య లు ప్రతిభచూపిన విద్యార్థిని రమ్య దుర్గను సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో హెచ్ఎం కె.హరనాథ్, తదితరులు పాల్గొన్నారు.

యాత్రికులకు వసతులు కల్పించేందుకు కృషి

ప్రజాశక్తి-కపిలేశ్వరపురం

మండలంలోని కేదార్లంక శివారు వీధి వారి లంక గ్రామంలో పూడల మర్రి చెట్టు కింద వెలసిన ధనమ్మ అమ్మవారి ఆలయానికి వచ్చే యాత్రికులు కోసం అన్ని సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తానని కేదార్లంక సర్పంచ్ వీధి వెంకట రెడ్డి అన్నారు. ఆయన ఆదివారం మాట్లాడుతూ ఈ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నానని అన్నారు. ధనమ్మ అమ్మవారిని దర్శించుకునేందుకు సుదూర ప్రాంతాలనుంచి యాత్రికులు కుటుంబ సమేతంగా తరలివచ్చి మొక్కుబడులు చెల్లించుకుంటారన్నారు.. పెద్ద వక్షం లో వెలిసిన ఈ అమ్మవారిని తిలకించేందుకు కపిలేశ్వరపురం మండల ప్రజలు గోదావరి పడవ మార్గం ద్వారా వస్తూ ఉంటారని అన్నారు. అనేక ప్రాంతాలైన రాజోలు, అమలాపురం ,గన్నవరం, కొత్తపేట రాజమహేంద్రవరం, కాకినాడ,తదితర ప్రాంతాల నుంచి వచ్చే యాత్రికులు బోడిపాలెం వంతెన మీదుగా అమ్మవారి దర్శనానికి వచ్చి ఇక్కడే వంటావార్పు చేసుకుంటారని అన్నారు.

సత్యనారాయణ స్వామి కళ్యాణం

ప్రజాశక్తి-కపిలేశ్వరపురం

కేదార్లంక గ్రామ శివారు వీధి వారి లంక లో వేంచేసియున్న సత్యనారాయణ స్వామి కల్యాణం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండపేట నియోజక వర్గ సర్పంచ్‌ల సమైఖ్య అధ్యక్షులు వీధి వెంకటరెడ్డి సతీసమేతంగా ఈ కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు. వేదపండితులు ఆధ్వర్యంలో స్వామివారి కళ్యాణం నిర్వహించారు. యాత్రికులు స్వామి వారి కల్యాణాన్ని తిలకించారు. సత్యనారాయణ స్వామి కళ్యాణం అనంతరం జరిగిన భారీ అన్న సమారాధనకు గ్రామస్తులతో పాటు అధిక సంఖ్యలో యాత్రికులు తరలివచ్చి స్వామివారి అన్న ప్రసాదం స్వీకరించారు.

24 వరకు అగస్తేశ్వర, పాప వినాసేశ్వర స్వామి వార్ల కళ్యాణ మహోత్సవాలు

కపిలేశ్వరపురంలో ఉన్న పార్వతి అగస్తేశ్వర స్వామి, దుర్గామాత సమేత పార్వతి పాప వినాసేశ్వర స్వామి వార్ల కళ్యాణ మహోత్సవాలు ఈ నెల 19 నుంచి 24వ తేదీ వరకు నిర్వహిస్తామని ఆలయ కార్య నిర్వహణాధికారి కొండ శ్రీనివాసరావు ఆదివారం తెలిపారు. ఆదివారం రాత్రి ఆలయ అర్చకులు కాలదరి కృష్ణ భగవాసులు ఆధ్వర్యంలో స్వామి వార్ల కల్యాణ మహోత్సవా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ వద్ద చలువ పందిర్లు ఏర్పాటు చేసి ఆలయాలను రంగురంగులతో సుందరంగా తీర్చిదిద్ది విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఎటువంటి సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు .

జీవవైవిధ్యం పరిరక్షణతోనే మానవ మనుగడ

ప్రజాశక్తి - కాకినాడ

జీవవైవిద్యం పరిరక్షణతోనే మానవ మనుగడ సాధ్యమని జవహర్ లాల్ నెహ్రూ టెక్నాలజికల్ యూనివర్సిటీ సంచాలకులు డాక్టర్ కెవిఎస్‌జి.మురళీకృష్ణ అన్నారు. ఆదివారం పిఆర్ డిగ్రీ కళాశాలలో ఎపి జీవవైవిద్య మండలి, పిఆర్ డిగ్రీ కళాశాల వృక్ష శాస్త్ర విభాగం సంయుక్త ఆధ్వర్యంలో జిల్లా స్థాయి పర్యావరణ పోటీలు జరిగాయి. ఈ సందర్భంగా 22న విశాఖపట్నంలో నిర్వహిస్తున్న జాతియ స్థాయి అంతర్జాతీయ జీవవైవిద్య దినోత్సవం గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ జీవవైవిద్య పరిరక్షణతోనే మానవ మనుగడ సాధ్యమని అన్నారు. భారతదేశం జీవవైవిద్య పరంగా అతి బలమైన దేశమని, ఇది ప్రపంచ దేశాలతో పోలిస్తే 17వ స్థానంలో ఉందన్నారు. సుమారు 1200 పక్షి జాతులు, వివిధ జంతువులు ఉన్నాయన్నారు. ఇస్రో విశ్రాంత శాస్త్రవేత్త వై.శివప్రసాద్ మాట్లాడుతూ జీవవైవిద్య పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఆంధ్రప్రదేశ్ నేషనల్ గ్రీన్ కోర్ ప్రాంతీయ సమన్వయకర్త కేసరి శ్రీనివాసరావు మాట్లాడుతూ జీవవైవిద్యానికి నష్టం కలిగించే ప్లాస్టిక్ వాడకం తగ్గించాలని వివిధ వృక్షజాతులు పరిరక్షించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా 4వ తరగతి నుంచి డిగ్రీ చదువుతున్న విద్యార్థినీ, విద్యార్థులకు చిత్ర లేఖనం, వక్తృత్వం, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో జిల్లాలోని పలు పాఠశా లలు, కళాశాలలకు చెందిన 273 మంది విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ రిసోర్స్‌పర్సన్స్ ఎన్.వీరభద్రరావు, వివిఎస్‌వి.రమణ మూర్తి, పిల్లి గోవిందరాజులు పాల్గొన్నారు.

జీవవైవిద్య దినోత్సవం గోడ పత్రికను ఆవిష్కరిస్తున్న నిర్వహకులు

పోటీల్లో పాల్గొంటున్న విద్యార్థినీ, విద్యార్థులు

మురుగునీటితో అవస్థలు

ప్రజాశక్తి - పిఠాపురం

మండలంలోని విరవాడ ఎస్‌సి కాలనీ ప్రజలు మురుగు నీటితో అవస్థలు పడుతున్నారు. ఇళ్ళ పరిస రాల్లో మురుగు నీరు నిలు స్తోందని వాటిలో పందులు స్వైర విహారం, దోమల బెడదతో రోగాల బారిన పడుతున్నామని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలనీలో సుమారు 300 కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. సరైన డ్రయినేజి వ్యవస్థ లేకపోవడంతో ఎక్కడ మురుగు నీరు అక్కడే అన్నట్లుగా పరిస్థితి మారిపోయింది. ఒకపక్క ఇళ్లలో వినియోగించిన తరువాత వచ్చే వ్యర్థ నీటితోపాటు, వర్షం నీరు కలిసి ఇంటి వాకిట ముందే నిలిచిపోతుంది. రోజుల తరబడి నీటి నిల్వ ఉండటంతో కాలనీ ప్రాంతమంతా దుర్వాసన వేదజల్లుతోంది. దుర్వాసన వస్తున్న కనీసం పంచాయతీ సిబ్బంది బ్లీచింగ్ కూడా చల్లడం లేదని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షం పడితే నీరు ఇళ్ళలోకి చేరుతుందని, సదరు ప్రాంతం మొత్తం చెరువును తలపిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాలనీ వీధుల్లో రోడ్డు నిర్మించిన అధికారులు డ్రయినేజీలను నిర్మించకపోవడంతోనే ఈ పరిస్థితి తలెత్తుతుందని కాలనీ వాసులు ఆరోపిస్తున్నారు. తమ సమస్యలను ప్రజా ప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా చర్యలు తీసుకోవడం లేదని విమర్శలు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి డ్రయినేజీలు నిర్మించి సమస్యలను పరిష్కరించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

డ్రైయినేజీ లేకపోవడంతో ముందుకు కదలని మురుగునీరు

సాహితీ సమాలోచన సదస్సులో గౌరీ నాయుడు

ప్రజాశక్తి - పిఠాపురం

పట్టణానికి చెందిన యువ సాహితీవేత్త, రాచకొండ నరసింహ శర్మ సాహితీ సంస్థ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ కిలారి గౌరీ నాయుడు విశాఖపట్నంలో జరిగిన సాహితీ సమాలోన సదస్సులో అతిథి ఉపన్యాసం చేశారు. సాహిత్య రంగ ప్రతినిధుల సదస్సులో ఆచార్య జర్రా అప్పారావు రచనలు, సామాజిక సేవా రంగానికి అందిస్తున్న సేవలు, ఆంధ్ర విశ్వ కళాపరిషత్ తెలుగు శాఖ అభ్యున్నతికి చేస్తున్న కషిని వివరించారు. ఆచార్య చందు సుబ్బారావు 79వ పుట్టినరోజు సందర్భంగా సాహిత్య విమర్శ-సామాజిక విశ్లేషణ అనే అంశంపై నిర్వహించిన చర్చా గోష్టిలో పాల్గొని సాహిత్య రంగంలో, అనువాదంలో, విశేష కృషి చేస్తున్న ఆంధ్ర విశ్వ కళాపరిషత్ విశ్రాంత భూ భౌతిక శాస్త్ర ఆచార్యులు చందు సుబ్బారావు నెలకొల్పిన సాహితీ సంస్థ వార్షికోత్సవ సభలో సుప్రసిద్ధ రచయితలు, ఉద్దండ పండితులు, కళాకారులు, ప్రఖ్యాత విమర్శకుల మధ్య ప్రసంగించే అవకాశం రావడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా చందు సుబ్బారావు సాహితీ సంస్థ కార్యవర్గ సభ్యులు ఉప్పల అప్పలరాజు, ద్రవిడ విశ్వవిద్యాలయం పూర్వ ఉపకులపతి ప్రొఫెసర్ కెఎస్.చలం, ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం పూర్వ ఉపకులపతి ఆచార్య ముర్రు ముత్యాలనాయుడు, శేఖర్, ప్రభాకర్ తదితరులు తనని అభినందించి, సాహిత్య రంగంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారన్నారు.

సదస్సులో మాట్లాడుతున్న గౌరీ నాయుడు

నీళ్లు రాని కుళాయి(ఇన్‌సెట్‌లో మాట్లాడుతున్న మహిళలు)

జగనన్న కాలనీలో తాగునీటి కష్టాలు

ప్రజాశక్తి - సామర్లకోట

సామర్లకోట-ప్రత్తిపాడు రోడ్డులో జి.రాగంపేట సమీపాన ఉన్న జగనన్న కాలనీ ప్రజలు తాగునీటి కష్టాలను ఎదుర్కొంటున్నారు. మొక్క లపై ఉన్న ఆసక్తి మనుషుల మీద లేదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. జగనన్న కాలనీలో గృహాలు నిర్మించు కున్న కాలనీవాసులకు గత మూడు రోజులుగా కుళాయిల ద్వారా సరఫరా చేసే నీటిని సక్రమంగా అందించక పోవడంతో ప్రజలు తాగునీటిని కొనుగోలు చేసుకుని తెచ్చుకుంటున్నారు. ఈ సమస్య వారంలో రెండు మూడు రోజులు కన్నా ఎక్కువగానే ఉంటుందని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నీటిని విడుదల చేసే వ్యక్తి మోటార్‌కు తాళం వేసుకుని పోవడంతో తాము తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు జోక్యం చేసుకుని తాగునీటి సమస్య పరిష్కరించాలని కాలనీవాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

కష్టపడ్డం...విజయం సాధిస్తున్నాం

ఆత్మీయ సమావేశంలో తెలుగు తమ్ముళ్లు

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

సీటు రాలేదని నిరాశ చెందకుండా చంద్రబాబు మాటే వేదవాక్కులా భావించి పొత్తు ధర్మంలో జనసేన అభ్యర్థి గెలుపునకు కష్టపడ్డామని, జూన్ 4న విజయం సాధిస్తున్నామని పలువురు అన్నారు. ఆదివారం రూరల్ మండలం సర్పవరం జంక్షన్ సమీపంలో టిడిపి ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ గత ఐదేళ్లుగా ప్రతిపక్షంలో ఉంటూ పాలకపక్షం ఎన్ని ఇబ్బందలకు గురిచేసిన ఎదుర్కొని నిలబడ్డామన్నారు. రూరల్ నియోజకవర్గం నుంచి పిల్లి సత్యనారాయణమూర్తి, పిల్లి అనంతలక్ష్మిలకు టిక్కెట్టు వస్తుందని ఆశించామన్నారు. అయితే పొత్తు ధర్మంలో ఆ సీటును జనసేనకు కేటాయించారని అన్నారు. ఐనా ఈ ఎన్నికలను ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకుని జనసేన అభ్యర్థి గెలుపునకు కృషి చేశామన్నారు. రాబోయే రోజుల్లో ఏర్పడే టిడిపి ప్రభుత్వంలో పిల్లి అనంతలక్ష్మి, సత్యనారాయణ మూర్తి దంపతులకు తగిన ప్రాధాన్యత కల్పించాలని కోరారు. ఈ సందర్భంగా పిల్లి అనంతలక్ష్మి సత్యనారాయణ మూర్తి దంపతులు మాట్లాడుతూ నియోజక వర్గంలో ప్రతీ ఒక్కరూ మమ్మల్ని మీ కుటుంబ సభ్యులుగా చూస్తారు కాబట్టే మేము ఈ స్థాయిలో ఉన్నామని అన్నారు. మీ ప్రేమాభిమానాలు రానున్న రోజుల్లో కూడా మాపై ఉండాలని ఆకాంక్షించారు.

రాకపోకలకు తప్పని ఇక్కట్లు

ప్రజాశక్తి - సామర్లకోట

పట్టణంలోని అయోధ్య రామపురం సత్తమ్మ ఆలయం వద్ద ఉన్న కల్వర్టు శిథిలావస్థకు చేరడంతో ఆ ప్రాంతంలో నివసించే స్థానికులు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.కల్వర్టు శిథిలమై నెలలు గడుస్తున్న సంబంధిత మున్సిపల్ అధికారులు స్పందించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. డ్రయినేజీలలోని వ్యర్థనీరు కల్వర్టు పైనుంచి ప్రవహించడంతో తీవ్ర దుర్గంధం ఏర్పడి దుర్వాసన వెదజల్లుతుంది. ఈ కారణంగా స్థానికులు అనారోగ్యాలకు గురౌతున్నారు. తక్షణమే అధికారులు స్పందించి శిథిల కల్వర్టును పునర్నిర్మించాలని, అజారోగ్యాన్ని పర్యక్షిస్తూ చర్యలు చేపట్టాలని ఆ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

శిథిలమైన కల్వర్టు

ఎన్నికల కమిషన్ ఆదేశాలు పాటించాలి

ప్రజాశక్తి - పెద్దాపురం

పెట్రోల్ బంక్ యాజమాన్యాలు ఎన్నికల కమిషన్ ఆదేశాలను తూచా తప్పకుండా పాటించాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్‌డిఒ జె.సీతారామారావు అన్నారు. ఆదివారం రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ పూర్తయ్యేంతవరకు పెట్రోలు, డీజిల్‌ను బంకులకు వచ్చిన వాహనాలకు మాత్రమే విక్రయించాలన్నారు. సీసాలు, ప్లాస్టిక్ బాటిల్స్‌లో పెట్రోలు, డీజిల్ విక్రయించరాదన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవన్నారు.

మరిడమ్మ ఆలయం వద్ద మజ్జిగ పంపిణీ

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక మరిడమ్మ ఆలయం వద్ద దేవస్థానం ఆధ్వ ర్యంలో ఆదివారం ఏర్పాటుచేసిన మజ్జిగ చలివేంద్రాన్ని దేవాలయం అసిస్టెంట్ కమిషనర్ సిహెచ్. రామమోహన్‌రావు ప్రారంభిం చారు. ప్రస్తుత వేసవిని దృష్టిలో పెట్టుకుని దేవస్థానం ఆధ్వర్యంలో ఈ చలివేంద్రం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జి క్రాంతి వీర్, లోవరాజు తదితరులు పాల్గొన్నారు.

బారులు తీరిన యాత్రికులు

పెద్దాపురం : మండలంలోని కాండ్రకోట గ్రామంలో జరుగు తున్న నూకాలమ్మ జాతరకు ఆదివారం యాత్రికులు బారు లు తీరారు. యాత్రికులు ఎటువంటి ఇబ్బందులు పడకుండా ఆలయ కార్య నిర్వ హణాధికారి తలాటం వెంకట సూర్యనారాయణ, ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మన్ గవరసాన వీరాస్వామి ఆధ్వర్యంలో ఆలయ సిబ్బంది, ధర్మకర్తలు సేవలందించారు. యాత్రికులకు మజ్జిగ, మంచినీరు సరఫరా చేశారు.

ఘనంగా వెంకన్న కళ్యాణం

గండేపల్లి : గండేపల్లి గ్రామంలో జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం వెంకటేశ్వర స్వామి కళ్యాణాన్ని వైభవంగా నిర్వహిం చారు. నేమాల అప్పారావు, రాఘవ దంపతులు పీటల మీద కూర్చుని కళ్యాణ మహోత్సవం నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ, మంగళ వాయిద్యాలు మధ్య జరిగింది. కళ్యాణానికి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కళ్యాణ అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ కళ్యాణ మహోత్సవం ఐదు రోజులపాటు ఘనంగా నిర్వహిస్తామని చెప్పారు. ఆఖరి రోజున ఆలయ ప్రాంగణంలో అన్న సమారాధన కార్యక్రమం నిర్వహిస్తామని వివరించారు.

కమనీయం... సత్యదేవుని కళ్యాణం

వేలాది సంఖ్యలో యాత్రికుల హాజరు

ప్రజాశక్తి - అన్నవరం

అన్నవరం రత్నగిరిపై వీర వేంకట సత్యనారాయణస్వామి వార్షిక దివ్యకళ్యాణం వైశాఖ శుద్ధ ఏకాదశీ ఆదివారం రాత్రి కమనీయంగా జరిగింది. ఈ కళ్యాణ కార్యక్రమాన్ని వీక్షించేందుకు పెద్దసంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. యాత్రికుల రాకతో రత్నగిరి భక్త జనసంద్రమైంది. ఈ వేడుకల్లో భాగంగా ఉదయం 8 గంటలకు ప్రధానాలయం వద్ద సంప్రదాయ బద్దంగా అంకురార్పణ చేసి సంకల్పం చేశారు. రాత్రి 7 గంటలకు వధూవరులైన సత్యదేవుని వెండి గరుడవాహనంపైన, అనంతలక్ష్మీ అమ్మవారికి పెళ్లి పెద్దలైన క్షేత్రపాలకులు సీతారాముల సమక్షంలో వెండి రథంపై గ్రామంలో గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం వివిధ పరిమళ పుష్పాలతో, విద్యుత్ దీపాల అలంకరణతో తయారుచేసిన కళ్యాణవేదికపై స్వామి అమ్మవారిని తీసుకొని వచ్చారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం తరపున రాష్ట్ర దేవాదాయ కమిషనర్ ఎస్.సత్యనారాయణస్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పించారు. దేవస్థానం ఛైర్మన్ రాజా ఐవి.రోహిత్ దంపతులు, ఇఒ కోడూరి రామచంద్రమోహన్ దంపతులతో పాటు జిల్లా అధికారులు కళ్యాణ సామగ్రిని వేదికవద్దకు తీసుకొచ్చారు. రాత్రి గం. 9.30 లకు స్వామివారి దివ్య కళ్యాణ ఘట్టానికి అర్చకస్వాములు శ్రీకారం చుట్టారు. పలు వైదిక కార్యక్రమాలను సంప్రదాయబద్దంగా పూర్తిచేశారు. అనంతరం మంగళవాయిద్యాలు, వేదపండితుల మంత్రోచ్చారణలతో స్వామి, అమ్మవార్ల శిరస్సులపై ఒకరికొకరు జీలకర్ర, బెల్లం ఉంచినట్లుగా చేసి సుముహూర్తధారణ గావించారు. నూతన వధూవరుల పాణిగ్రహణంతో కళ్యాణతంతు వైభవంగా ముగిసింది. తదుపరి స్వామివారి ప్రసాదం, కళ్యాణ తలంబ్రాలను ప్రత్యేక కౌంటర్ల ద్వారా ఆలయ సిబ్బంది భక్తులకు వితరణ చేశారు. కళ్యాణాన్ని తిలకించడానికి వచ్చిన భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా దేవస్థానం అధికారులు తగిన చర్యలు తీసుకోగా పోలీసులు పటిష్టమైన బందోబస్తు ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ శ్రీనివాస్, పెద్దాపురం డిఎస్‌పి లతా కుమారి పాల్గొన్నారు

కళ్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు, అధికారులు

ఇసుక అక్రమ తవ్వకాలపై ఫిర్యాదు

ప్రజాశక్తి- ఆత్రేయపురం

గౌతమి గోదావరి నదిలో మండలంలోని మెర్లపాలెం గ్రామ పరిధిలో ప్రతిమా ఇన్ఫ్రాస్ట్రక్చర్ కంపెనీ చేసిన అక్రమ ఇసుక తవ్వకాలపై చర్యలు తీసుకోవాలని జిల్లా ఇసుక కమిటికి ఫిర్యాదు చేసినట్లు మర్లపాలెం గ్రామ సర్పంచ్ మెర్ల రాము ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఊబలంకలో తవ్వకాలకు అనుమతులు పొందిన ప్రతిమా కంపెనీ మైనింగ్ నిబంధనలు పాటించకుండా జియో కోఆర్డినేషన్ పరిధి దాటివచ్చి మెర్లపాలెం పరిధిలో తవ్విన ఇసుక పరిమాణాన్ని గుర్తించేందుకు సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు మైనింగ్ సర్వే బృందం, జిల్లా రెవెన్యూ సర్వే బందంతో సర్వే చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఆ మేరకు జిల్లా ఇసుక కమిటీ ఛైర్మన్ కలెక్టర్‌కు, మైనింగ్, పొల్యూషన్ కాంట్రాబోర్డు ఇతర ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు సర్పంచ్ రాము విలేకరులకు తెలిపారు.

'మోడరన్' విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-రామచంద్రపురం

తెలంగాణలో ఈనెల 18న ప్రకటించిన ఇఎపిసెట్ ఫలితాల్లో మోడరన్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారని విద్యాసంస్థల అధినేత లయిన్ జివి.రావు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో కె.సుహర్షిత్ 2402వ ర్యాంక్ సాధించి పట్టణ ప్రథమ స్థానం సాధించాడని, ఎన్ఎం.లహరి 5634వ ర్యాంక్‌తో టౌన్‌లో ద్వితీయస్థానం సాధించిందని పేర్కొన్నారు. అలాగే డి.శ్రీగురుదత్త 7691వ ర్యాంక్, ఎన్ఎస్‌టి.సంతోష్ 8789వ ర్యాంక్ సాధించారని పేర్కొన్నారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులకు కరస్పాండెంట్ జివి.రావు, ప్రిన్సిపల్ సిహెచ్.రాజేష్, మోడరన్ అధ్యాపకులు అభినందనలు తెలిపారు.

పదేళ్లుగా పరిష్కారం కాని సమస్యలు

పేరుకుపోయిన చెత్త

- 4వ వార్డు లో పారిశుధ్యం
- అధ్వానం చెరువులా రోడ్లు
- పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి-రామచంద్రపురం

గత పదేళ్లుగా పరిష్కారం కాని సమస్య లతో పట్టణం లోని 4 వ వార్డు ప్రజలు సతమతమవుతున్నారు. రామచంద్రపురం పట్టణం లోని బస్టాండ్ పక్కన మోడరన్ కళాశాల నాలుగో వీధిలో సమస్యలు తిష్ట వేశాయి.నిత్యం ఇక్కడ పేరుకు పోయిన చెత్తతో పందుల స్వైర విహారం చేస్తున్నాయి.ఇక డ్రయినేజీలు పొంగి మురుగు నీరు రోడ్ల పైకి వస్తోంది. దీనితో ఈగలు, దోమలు పెరిగి తీవ్ర దుర్గంధం వెదజల్లుతోంది. దీంతో అనారోగ్యబారిన పడే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళనచెందుతున్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు నీరు దిగే అవకాశం లేక పోవడం తో రోడ్డు మొత్తం చెరువును తలపిస్తున్నాయి. మున్సిపల్ అధికారులు దీనిపై దష్టి సారించాల్సిన అవసరం ఉంది. ఈ రోడ్డులో మోడరన్ కళాశాల ఉండటంతో పట్టణ వాసులతో పాటు విద్యార్థులు ఇక్కడ ఇక్కట్లకు గురవుతున్నారు.వెంటనే డ్రయిన్లు ఆధునికీకరించి, పారిశుధ్యం మెరుగు పరచాలని, చెత్తను తొలగించాలని, రోడ్లు పునరుద్ధరించాలని పట్టణంలోని నాలుగో వార్డు ప్రజలు కోరుతున్నారు.

నాలుగో వార్డులో చెరువులను తలపిస్తున్న రోడ్లు